మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# మోగనున్న మున్సి'పోల్స్' నగారా

- పక్షం రోజుల్లో నోటిఫికేషన్?
- ఓటర్ల తుది జాబితా విడుదలకు ఎస్ఈసీ కసరత్తు
- పాలమూరు జిల్లాలో ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు ఏర్పాట్లు

**భూత్పూర్, జనవరి 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల లో గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం అదేస్ఫూర్తితో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, ఆరు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) ఓటర్ల జాబితా తయారీలో తలామునకలైంది. జిల్లాలోని మహబూబ్‌నగర్‌తో పాటు మరో నాలుగు(దేవరకద్ర, కొత్తకోట, జడ్చర్ల, భూత్పూర్) మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ కోసం నాల్గు రోజుల క్రితం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతేడాది ఒకటో తేది అక్టోబర్ నాటి డేటా ఆధారంగా అసెంబ్లీ నియోజకవర్గాల మున్సిపల్ వార్డుల వారీగా ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కూడా సమాచారం. గత నెల30న ఈసీఐ పోలింగ్ స్టేషన్ల డేటాను – మిగతా4లో..



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- అదనపు రెవెన్యూ కలెక్టర్ మధుసూదన్ నాయక్
- జిల్లా కలెక్టరేట్ సిబ్బందికి హెల్మెట్‌లు పంపిణీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 1 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించి ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించకుండా వాహనాలు నడపాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ జిల్లా కలెక్టరేట్ లో పనిచేస్తున్న పురుషులతో పాటు మహిళా సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. శరీరంలోని ఏ ఇతర భాగాలకు గాయం అయినా చికిత్స ద్వారా మానిపోవచ్చని, అయితే తలకు తీవ్రమైన గాయం జరిగితే ప్రాణాపాయం కలగడంతో పాటు వారి కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతుందని తెలిపారు. తన కుటుంబంలో జరిగిన ఒక సంఘటనను నెమరు వేసుకుంటూ, రోడ్డు ప్రమాదం లో తన సొంత కుటుంబ సభ్యున్ని కోల్పోయానని, అటువంటి పరిస్థితి ఇంకొకరికి రావద్దని ఆయన అన్నారు. "మనము ప్రొద్దున్నే ఇంటి నుండి బయలుదేరినప్పుడు మన కుటుంబ సభ్యులు చిరునవ్వుతో – మిగతా4లో..



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్, కరపత్రికలు, స్టిక్కర్ లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, జనవరి 1 ప్రభాతవార్త:** జనవరి ఒకటవ తేదీ నుండి ప్రారంభం కానున్న జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను వనపర్తి జిల్లాలో అత్యంత సవ్యంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా రోడ్డు రవాణా అధికారులతో కలిసి జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల అవగాహన గోడపత్రికలు, కర దీపికలు, స్టిక్కర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. జనవరి 1నుంచి నెల రోజుల పాటు నిర్వహించే రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం సవ్యంగా నిర్వహించాలని సూచించారు. రోజుకో కార్యక్రమం చొప్పున ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనల పై విద్యార్థులు, యువత, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, పాఠశాలల మేనేజ్మెంట్ బస్సు డ్రైవర్లకు రోజుకొక సంఘం వారిగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జనవరి 8న కలెక్టరేట్ నుండి ట్యాంక్ బండ్ వరకు – మిగతా4లో..

## భక్తులతో కిటకిటలాడిన కురుమతి కొండ

**చిన్న చింతకుంట, జనవరి 1 ప్రభాతవార్త :** భక్తుల ఇలవేల్పు శ్రీ కురుమూర్తి కొండకు భక్తులతో కిటకిటలాడింది. 2026 నూతన సంవత్సర సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ఈ నూతన సంవత్సరంలో ఆయురారోగ్యాలతో జీవించేలా ఆశీర్వదించాలని కోరుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో స్థానిక ఆలయాలు భక్తులతో కిటికీటలాడాయి. స్థానిక చర్చిలలో క్రిస్టియన్లు నూతన సంవత్సర సంబరాలను జరుపుకున్నారు. 2025 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2026 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం అర్ధరాత్రి యువత సంబరాలు జరుపుకున్నారు.



శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

# తాగారు.. దొరికారు..



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి

- నూతన సంవత్సర వేడుకల వేళ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- మద్యం సేవించి పట్టుబడ్డ 86 మంది వాహనదారులు
- భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 1 ప్రభాత వార్త:** మద్యం సేవించి వాహనాలు నడపొద్దని పోలీసు శాఖ పెద్ద ఎత్తున హెచ్చరికలు జారీ చేసిన అవేమి తమకు పట్టవని మరోసారి నిరూపించారు మందు బాబులు. మద్యం సేవించి దర్జాగా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. డిసెంబర్ 31 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లతో పాటు ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడగా, మొత్తం 86 మంది వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని ఎస్పీ జానకి ధరావత్ వెల్లడించారు. వీరిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి, న్యాయస్థానాలకు హాజరుపరిచే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా అర్ధరాత్రి అనంతరం పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించేందుకు జిల్లాఎస్పీ క్షేత్రస్థాయిలోతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణతో పాటు ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచనలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం పొంచి ఉంటుందని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ భద్రతాయుతంగా ప్రయాణించాలని జిల్లా ఎస్పీ డి. జానకి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

### 86 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు : జిల్లా ఎస్పీ డా.వినీత్

**నారాయణపేట, జనవరి 1 ప్రభాతవార్త :** నూతన సంవత్సరం సందర్భంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పేట జిల్లాలో పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా.వినీత్ తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి జనవరి 01 ఉదయం 6 గంటల వరకు జిల్లా పరిధిలోని 12 పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో మొత్తం 86 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాలకు తీవ్ర ప్రమాదమని ఆయన హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. వినీత్ తెలిపారు.





## 31 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజలకు అవగాహన కల్పించాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

37వ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 1 ప్రభాత వార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ 37వరోడ్డు భద్రత అవగాహన మాసోత్సవాల కార్యక్రమాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా రోడ్డు భద్రతా నినాదాలు, పోస్టర్లతో అలంకరించిన వాహనంను పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రవాణా శాఖ ఆధ్వర్యంలో జనవరి 1నుంచి జనవరి 31వరకు నెలరోజుల పాటు రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం, ప్రాంతీయ, జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రయాణికులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించకపోవటం వలన ప్రతి సంవత్సరం వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు సీటుబెల్ట్ ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత నినాదాలతో కూడిన కరపత్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిఓ అధికారి రఘు రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రతి వాహనదారుడు – మిగతా4లో..



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్, చిత్రంలో డిటిఓ

## జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

- నూతన సంవత్సరంలో జిల్లాకు మంచి పేరు తేవాలి..
- నూతన సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలి...
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 01 ప్రభాత వార్త:** నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని గురువారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో గురువారం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, జిల్లా పాలనాధికారిని కలిసి పుష్ప గుచ్ఛాలను, పూల మొక్కలు అందించి నూతన సంవత్సర 2026 శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, అనుకున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాను మరింత సుసంపన్నం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలో సమర్థవంతులైన, బాధ్యత కలిగిన అధికారులు, సిబ్బంది ఉన్నారని, అందువల్లనే గత సంవత్సరం గ్రామపంచాయతీ ఎన్నికలు, ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అంశాలలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించిందని, ఇందుకు కృషి చేసిన అన్ని శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ అభినందించారు. నూతన సంవత్సరం – మిగతా4లో..



జిల్లా కలెక్టర్‌తో ఆయా విభాగాల అధికారులు

### భర్త మృతిని తట్టుకోలేక...

## తల్లి, కూతురు మృతి..

కుమారుడి పరిస్థితి విషమం

- నూతన సంవత్సరం వేళ కల్వకుర్తిలో దారుణం

**కల్వకుర్తి, జనవరి 01 ప్రభాతవార్త:** నూతన సంవత్సరం వేళ కల్వకుర్తి పట్టణంలో గురువారం దారుణం చోటు చేసుకుంది. ఓతల్లి తన ఇద్దరు పిల్లలకు పురుగుల మందు కలిపిన అన్నం తినిపించి తాను తిన్న సంఘటన అందరిని కలిచివేస్తోంది. వివరాల్లోకి వెళితే... కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రసన్న (40), తన కుమార్తె మేఘన (13) కుమారుడు ఆశ్రిత్‌లో కలిసి బుధవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం పురుగుల మందు కలిపిన అన్నం పిల్లలకు తినిపించి తాను తిన్నట్లు సమాచారం. ఈఘటనలో తల్లికుతూరు మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. అనంతరం మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసన్న భర్త భీమ్‌శెట్టి ప్రకాష్ మృతి చెందారు. భర్త మృతుని తట్టుకోలేని భార్య తాము బ్రతికి ఉండటం కన్న చావడమే మేలు అని భావించి ముగ్గురు తనువు చాలించాలని భావించి పురుగుల మందు కలుపుకొని అన్నం తిని ఈ దురాగతానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కల్వకుర్తి ఎస్ఐ మాధవ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



లావణ్య ( ఫైల్ )



మేఘన ( ఫైల్ )



విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్ సంతోష్

### ప్రతి విద్యార్థి

## ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులతో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకున్న జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్

**గద్వాల జనవరి 01, ప్రభాతవార్త:** ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సరైన విధంగా వినియోగించుకొని కష్టపడి చదువుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. గురువారం పట్టణంలోని చింతల్ పేట్‌లోని షెడ్యూల్ కులాల ప్రభుత్వ బాలుర ఆనంద నిలయం వసతి గృహం మరియు సాంఘిక సంక్షేమ సమీకృత బాలల వసతి గృహంలో నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో కలెక్టర్ సహృదయ పూర్వకంగా ముచ్చటించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2026 నూతన సంవత్సరం సందర్భంగా వారి కలలు, వారి జీవనంలో తీసుకోబోయే మార్పులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు.. మీరు చాలా దూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి చదువుతున్నారని, మీ ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వము అన్ని విధాలుగా వసతి, విద్య, ఆహారం, తదితర సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. ఉన్నత స్థానాల్లో ఉన్న అనేక వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల నుంచి వచ్చి తమ కలలను సాధించారని, ప్రస్తుత ముఖ్య కార్యదర్శి శ్రీ రామకృష్ణ గారు కూడా ప్రభుత్వ పాఠశాల నుండి వచ్చి యూపీఎస్సీ ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పెద్ద కలలు కని, క్రమశిక్షణతో నిరంతరం కష్టపడి పనిచేస్తే విజయం తప్పక సాధ్యమని అన్నారు. విద్యతో పాటు శారీరక ఆరోగ్యం కూడా ముఖ్యమని, ప్రతి రోజూ విద్యార్థులందరూ వ్యాయామం చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని విధాలుగా జిల్లా పరిపాలన సమగ్ర చర్యలు తీసుకుంటుందని తెలిపారు. స్కాలర్‌షిప్ నమోదులో తెలంగాణ రాష్ట్రంలో జోగులాంబ గద్వాల్ జిల్లా 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా కలెక్టరేట్ లో సత్కరిస్తామని అన్నారు. 12 ఫెయిల్ లాంటి – మిగతా4లో..

## కార్యకర్తల మధ్య యెన్నం న్యూ ఇయర్ వేడుకలు

### మున్సిపల్ ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు

**మహబూబ్‌నగర్ జనవరి 1 ప్రభాతవార్త :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తమ క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీకి ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ఘన విజయం లభించిందని గుర్తు చేశారు. ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరడం వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటి నుంచే సన్నద్ధంగా ఉండాలని సూచించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కనీసం 60 స్థానాల్లో 50 స్థానాలకు పైగా గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉంటే కాంగ్రెస్ పార్టీని ఓడించే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచే విధంగా సేవాభావంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారే పల్లి సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహార్, ఐఎన్టీయుసి రాములు యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అవేజ్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, హన్వాడ మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నవనీత, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలి, సయ్యద్ ముస్తాక్ అలి, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, మైత్రి యాదయ్య, అమేధి, శ్రీనివాస్ రెడ్డి, కిషన్ నాయక్, చిన్న రాజు, మోయిజ్, హకీం, అలి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, మద్దూరి కృష్ణ, తుఫియన్ అహ్మద్, పీర్ మహ్మద్ సాదిక్ , మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు

### రూ.15 కోట్ల నిధులతో

## పనులు వేగవంతం చేయండి

ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

**దేవరకద్ర, జనవరి 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీకి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 కోట్ల నిధులకు సంబంధించి పనుల గురించి చర్చించి, దేవరకద్ర మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశించారు. దేవరకద్ర మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే అన్ని శాఖల అధికారులతో దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి, సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు వివిధ శాఖల అధికారులతో కలిసి, ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి – మిగతా4లో..



సమీక్ష సమావేశం లో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే

## కొత్త సంవత్సర కానుకగా
## తక్షణమే ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించాలి

### పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్



**జడ్చర్ల, జనవరి 1 ప్రభాతవార్త :** ప్రభుత్వాలు ఎన్ని వచ్చిన ఉద్యోగ,ఉపాధ్యాయుల తలరాతలు మారడం లేదని అందుకే తక్షణమే పీఆర్సీని ప్రకటించి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ అన్నారు. 01.07.2023 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ దాదాపుగా 30 నెలలు అయిన ఇంకా అమలుకు నోచుకోలేదని అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ సమస్యలన్నీ తీర్చాలని సీపీఎస్ ఉద్యోగులకు ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను కూడా త్వరగా తేవాలని, ముఖ్య మంత్రి విద్యాశాఖలో ఉన్న సమస్యలన్నిటిని మానవీయ కోణంలో ఒక కుటుంబ పెద్దగా భావించి సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించాలని నూతన సంవత్సర కానుకగా 2026 లో ఉద్యోగ,ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

## శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి

**ఉప్పునుంతల, జనవరి 1 ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గురువారం శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన ఆలయంలో మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఉమామహేశ్వర దేవస్థానం కమిటీ అధ్యక్షుడు బీరం మాధవరెడ్డి ఘనంగా స్వాగతం పలికి, వేద పండితులచే ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభాన్ని సందర్శించారు. ఉమామహేశ్వర దేవస్థానం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి,అయ్యవారి పల్లి గ్రామ సర్పంచ్ జిల్లెల జగత్ రెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, సూరం ప్రశాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఛత్రపతి శివాజీ మహరాజ్
## విగ్రహ ప్రతిష్టాపన కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

**నారాయణపేట, జనవరి 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటైన విగ్రహ ప్రతిష్టాపన సమితి ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయంలో కరపత్రం విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలో కేంద్రంలో శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిపారు. శివాజీ మహరాజ్ ఆదర్శాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర సంఘ్ చాలక్ మదన్ మోహన్ రెడ్డి, పెద్దలు జీకే కుర్మన్న, రఘురామయ్య గౌడ్, సుదర్శన్ రెడ్డి, కన్న శివకుమార్, పవన్ లాహోటి, రఘువీర్ యాదవ్, గడ్డం తిప్పన్న, పోశాల్ వినోద్, విజయ్ సాగర్, శ్రీపాద కులకర్ణి, శ్రవణ్, ప్రవీణ్,నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నప్రసాదం



అన్నప్రసాదం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జనవరి 1, ప్రభాతవార్త ;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం రోజు ఆత్మకూరు సీనియర్ పాత్రికేయులు జిందె శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, ఆంజనేయులు, విజయ్ కుమార్ తదితరుల నేతృత్వంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. నూతన ఆంగ్ల నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వాములకు బిచ్చ ఏర్పాటు చేయడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ స్థలదాత మొగిలి శ్రీధర్ గౌడ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా సీనియర్ పాత్రికేయులు,మైనార్టీసోదరులు మొహమ్మద్ రఫీతో పాటుగా బిజెపి మైనారిటీ నాయకులు తదితరులు అయ్యప్ప స్వాములకు అన్నదానం వడ్డించడంతో పలువురు స్వాములు సంతోషాన్ని వ్యక్తం చేశారు. నూతన ఆంగ్ల నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో జీవించాలంటూ సీనియర్ పాత్రికేయులు ఆకాంక్షించారు. అనంతరం గురుస్వాములు పాత్రికేయులను పలువురు అయ్యప్ప స్వామి భక్తులను వేదాశివచనాలతో ఆశీర్వదించారు.

## యాసంగిలో సరిపడ్డ యూరియా
### వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్



గోవర్ధనగిరి లో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్

**వీపనగండ్ల జనవరి 1, ప్రభాతవార్త :**యాసంగిలో యూరియా రైతులకు సరిపడ్డ విధంగా అందుబాటులో కలదు రైతులు ఎలాంటి ఇబ్బంది పడవద్దు అని మండల వ్యవసాయ అధికారి ఏ డాకేశ్వర్ గౌడ్ అన్నారు. ఆయన గురువారం నాడు మండలంలోని ఫర్టిలైజర్ షాప్‌లో ఫర్టిలైజర్ యూరియాను తనిఖీ చేశారు. గోదాముల్లో సరిపడ్డ యూరియా ఫర్టిలైజర్ ఎంత వరకు ఉన్నదని అది రైతులకు అందుబాటులో ఉన్నదా అని ఆరా తీశారు. యాసంగి పంటలకు సరిపడ యూరియా అందుబాటులో కలదు రైతులు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా మీయొక్క పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ కార్డు తీసుకెళ్లి యూరియా బస్తాలు తీసుకోగలరు. యూరియా సరఫరా అనేది నిరంతరం ప్రక్రియ యాసంగిలో సాగు చేసే పంటల విస్తీర్ణాన్ని బట్టి మండ లానికి 1977 మెట్రిక్ టన్నులు ఇవ్వడం జరిగింది. కనుక రైతులు సింగిల్ విండో సొసైటీసు, ఆగ్రో సెంటర్స్ మరియు ప్రైవేట్ ఫర్టిలైజర్ షాప్ లో నుండి తీసుకొనగలరు. ఫర్టిలైజర్ డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే నీదివీ ఆర్డర్ ప్రకారం చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడునని ఆయన హెచ్చరించారు.

## కారుతో ఢీకొట్టి
## హత్యాయత్నం, వ్యక్తిపై కేసు నమోదు



సంఘటనపై విచారణ చేస్తున్న పోలీసులు

**బాలానగర్, జనవరి 1 ప్రభాతవార్త :** బాలానగర్ మండల పరిధిలోని పెద్దరేవల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి బుద్ధం లింగారెడ్డిపై అదే గ్రామానికి చెందిన బంద్యాల తిరుపతి రెడ్డి తన కారుతో ఢీ కొట్టి హత్య చేసే ప్రయత్నం చేశాడు. ఈ ఘటనలో లింగారెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై లెనిన్ వివరాల మేరకు గ్రామంలో సాధు వెంకట్ రెడ్డి ఇంటి ప్రహరీలో బుధవారం రాత్రి కొత్త సంవత్సరం వేడుకలను లింగారెడ్డి గ్రామస్తులతో కలిసి నిర్వహించారు. వీరి పక్క ఇంట్లో ఉండే తిరుపతి రెడ్డి తల్లి దీనికి అభ్యంతరం తెలుపగా, రాత్రి 10 గంటల సమయంలో ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఇంటి ముందు చెత్తను తొలగిస్తుండగా, పక్కింటి బంద్యాల తిరుపతి రెడ్డి, లింగారెడ్డి భార్య గురించి అసభ్యంగా మాట్లాడి గొడవ పెట్టుకున్నాడు. గ్రామస్తులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి తిరుపతి రెడ్డి ఇటీవలే జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తన అభ్యర్థి ఓటమికి లింగారెడ్డి కారణమని భావించి తన సొంత కారుతో ఢీ కొట్టి హత్య చేసే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న బొర్ర రాజ్ కుమార్ లింగారెడ్డిని పక్కకు నెట్టి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పి, స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుడు లింగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

### డ్రైవింగ్‌ను సామాజిక బాధ్యతగా గుర్తిస్తేనే
# ప్రమాదాలను నివారించవచ్చు




ప్రమాద నివారణ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్, ఆర్ టి ఓ అధికారులు

**గద్వాల జనవరి 1, ప్రభాతవార్త:** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను గురువారం కలెక్టర్ తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల బారినపడిన వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు ఇంటి యజమాని మరణిస్తే ఎంత ఆవేదనకు గురవుతారో ఆలోచించాలన్నారు. ఏటా అనారోగ్యాల కారణంగా మరణించే వారి సంఖ్య కన్నా రహదారి ప్రమాదాల్లో మృతి చెందే వారే ఎక్కువగా ఉంటుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రహదారి భద్రతపై చాలామందికి అవగాహన లేకపోవడం, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏటా జనవరి నెల మొత్తం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రజలు రహదారి నియమాలను పాటిస్తూ, సురక్షిత ప్రయాణాలు చేసేందుకు రోడ్డు భద్రత మాసోత్సవాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఆర్టిఓ కృష్ణారెడ్డి, ఎంవీఐ రాములు, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా
### గుండ్ల పొట్లపల్లి సర్పంచ్ మాడమోని మాసయ్య

**రాజాపూర్, జనవరి 1 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలంలోని గుండ్ల పొట్లపల్లి గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గుండ్ల పొట్లపల్లి గ్రామ నూతన సర్పంచ్ మాడమోని మాసయ్య పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు సర్పంచ్ మాసయ్య వార్త ప్రతినిధితో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలోని బండమీద ఆకుల నర్సింలు నివాసం నుంచి దుందుభి నది వరకు అంతర్గత మురుగునీటి కాలువ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తానని అన్నారు. అలాగే భూ లక్ష్మమ్మ కాలనీ నుంచి పాత ఊరు వరకు మురుగు నీటి కాల్వ కోసం శ్రమిస్తానని తెలిపారు. సర్పంచ్ గా గెలిచిన మొదట్లోనే గ్రామంలో 80 వరకు వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో పలుచోట్ల సక్రమంగా లేని విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి త్వరలోనే స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. గ్రామపంచాయతీలోని రంగం భాయి తండకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృషితో సిసి రోడ్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని, గ్రామంలో తాగునీటి సమస్య కోసం ప్రస్తుతం ఉన్న బోరును ట్యాంకుకు కలిపి నీటి సమస్య తలెత్తకుండా కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా సర్పంచ్ మాసయ్య వెల్లడించారు.

## తపస్ మక్తల్ మండల అధ్యక్షుడిగా నరసింహ



**మక్తల్ టౌన్,జనవరి 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మక్తల్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మక్తల్ పట్టణంలోని కాకతీయ స్కూలులో ఎన్నుకోవడం జరిగింది. మక్తల్ మండల అధ్యక్షుడుగా ఉన్న బొమ్మనపాడు రవీందర్‌ను నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందున ఆయన స్థానంలో మక్తల్ మండల అధ్యక్షుడిగా గుడిగండ్ల నరసింహని, గౌరవ అధ్యక్షులుగా ఆత్మూర్ నర్సిరెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా రాకేష్‌ని, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులుగా భీమ్ రెడ్డి, వెంకట రాములు వ్యవహరించగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు నర్సిరెడ్డి, అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సంక్షేమం మరియు సమస్యల పరిష్కారం కోసం తాము అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొనడం జరిగింది.తపస్ మక్తల్ మండల కార్యవర్గం కమిటీ ఉపాధ్యక్షులుగా ప్రహ్లాద్, రామాం జనేయులు, వీణ సహాయ కార్యదర్శులుగా వనజ, రాజాంజనేయులు, శివజ్యోతి మండల సమన్వయకర్తలుగా జి.నరేష్, రాములు, రాము గౌడ్ కోశాధికారిగా అనిల్ రెడ్డి, మీడియా ఇంఛార్జిగా సురేష్ కాంప్లెక్స్ కన్వీనర్లుగా రవీందర్ రెడ్డి, జగదీష్, సౌమ్య, ప్రవర్ధన్, ప్రకాష్ ,స్వప్న, మదన్, శివరాజ్, మానస.కార్యదర్శులుగా వెంకటేష్ నర్సింలు, కనకాద్రి, కమలాకర్ దన్ సింగ్, నరసింహ, అంజప్ప, సోమనాథ్, భాస్కర్‌నాయక్, మహిళా ప్రముఖులుగా అనురాధ, మౌనిక, రమ్య, సాయిపావని, వరలక్ష్మి, జ్యోతి, ప్రతిభ, కల్పన,బిందు తదితరులను ఎన్నుకొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా.వినీత్




సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న జిల్లా ఎస్పీ డా. వినీత్

**నారాయణపేట జనవరి 1 ప్రభాతవార్త :** నూతన సంవత్సరం-2026 సందర్భంగా పేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాఎస్పీ డా.వినీత్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి కేకు కట్‌చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులు, పోలీస్ సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.2025సంవత్సరం పోలీస్‌శాఖకు తీపి చేదు అనుభవాల తో గడిచిందని ఎస్పీ పేర్కొన్నారు. నూతన సంవత్సరం కేవలం తేదీ మార్పు మాత్రమే కాకుండా, గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకునే అవకాశం అని అన్నారు 2026 సంవత్సరాన్ని కొత్త లక్ష్యాలతో ప్రారంభించి వాటిని సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలని జిల్లా పోలీస్‌కు సూచించారు. తెలంగాణ పోలీస్‌కు, పేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేశారని అభినందించారు. నేరాల నియంత్రణలో సునిశితమైన దృష్టితో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే నేరాలు తగ్గడం, నేరస్తులకు శిక్షలు పడడం జిల్లా నుంచి మంచి ఫలితాలుగా ఆయన పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన పోలీస్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. రోజురోజుకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం పోలీస్ శాఖలో అందుబాటులోకి వస్తోందని అన్నారు. వాటిని సమర్థంగా వినియోగించుకుని ఈ సంవత్సరం మరింత మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని ఎస్పీ డా.వినీత్ తెలిపారు.

### గోపాల్ దీన్నే డాటా ఎంట్రీ ఆపరేటర్
## అవినీతిపై వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేయాలి
### రైతు సంఘం రాష్ట్ర నాయకులు జబ్బర్



కలెక్టరుకు వినతి పత్రం ఇస్తున్న గోపాలదిన్నె సర్పంచ్ దొడ్ల కవిత రైతు సంఘం రాష్ట్ర నాయకులు

**వీపనగండ్ల జనవరి 1, ప్రభాతవార్త:** గోపాల్ దిన్నె ఐకెపి వరి కొనుగోలు డాటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేయాలని కలెక్టర్ ఆదర్శ సురభికి గురువారం నాడు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బర్, గోపాలదిన్నె గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, నాయకులు నిరంజన్, భాస్కర్ మహిళా సంఘం సభ్యులు, వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేను ఎంక్వయిరీ చేస్తానని సవివరంగా ఈ విషయంపై విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అదేవిధంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు జబ్బర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో జరిగిన అవినీతిని వెంటనే వెలికితీయాలని వారు కోరారు. గత నాలుగు రోజుల నుంచి విషయం తెలిసిన ఇప్పటివరకు కూడా కేసుచేయకుండా ఆలస్యం చేయడం సరైనపద్ధతి కాదని వారన్నారు.వెంటనే కేసు నమోదు చేసి,వాస్తవాలను బయటకుతీసి,అవినీతి జరుగుతే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవంగా గోపాల్దిన్నె సెంటర్ ఐకెపి నుంచి వడ్లు కాంట చేయకుండానే గద్వాల ఇమాన్ రైస్ మిల్కు పంపినట్లు చెప్తున్నారు. ఆ వెంబడే ఆ రైస్ మిల్లు యజమాని వనపర్తి పౌరసరఫరాల శాఖ అధికారికి క్వాంటిటీ రసీదును పంపివ్వడం జరిగింది. నెలల తరబడి వడ్లు తూకమైన రైతుల ఖాతాలో డబ్బులు పడడం లేదు ఇది నాలుగు రోజులనే వెనువెంటనే జరిగింది కాబట్టి ఇక్కడ అక్రమాలకు పాల్పడ్డట్లు పూర్తిగా తెలుస్తుంది అని అన్నారు. దీనిపై నిర్లక్ష్యం వహిస్తే మహిళలను రైతులను సమీకరించి ఆందోళన పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులకు ప్లే గ్రౌండ్ పరికారాలు అందజేత



విద్యార్థులకు ప్లే గ్రౌండ్ పరికరాలు అందజేత

**ఉప్పునుంతల,జనవరి 1 ప్రభాతవార్త :**విద్యార్థులకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించే ప్లే గ్రౌండ్ ఎక్విప్‌మెంట్ నూతన సంవత్సర సందర్భంగా విద్యార్థులకు ప్లే గ్రౌండ్ పరికారాలు అందజేశారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో అచ్చంపేటలో మల్లికార్జున వనవాసి ఆవాస్ విద్యార్థులతో న్యూయార్క్‌లో ఉంటున్న తాడురు వాసి జనంపల్లి ప్రసన్న అప్పట్లో వనవాసిని సందర్శించి విద్యార్థులకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించే ప్లే గ్రౌండ్ ఎక్విప్‌మెంట్ అందిస్తానని హామీ ఇచ్చారు.ఈమేరకు విద్యార్థులచే ప్రత్యక్షంగా సంప్రదింపులు జరపడం విశేషం. 90 వేల రూపాయలు అందజేశారు. నూతన సంవత్సర సందర్భంగా కానుకగా భావించి మన విద్యార్థులకు కమిటీ సభ్యులతో పాటు సత్యసాయి యోగ కమిటీ వారి సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమం స్ఫూర్తితో అచ్చంపేట సత్యసాయి యోగా కమిటీ వారు విద్యార్థులకు అదనంగా అవసరమైన ఇతరత్రా వాటిని సమకూర్చుటకు వారు ఆమె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రేయోభిలాషులకు ఆవాస ఇంఛార్జి గట్టు అశోక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు దామోదర్ శెట్టి, కుమారస్వామి, నరసింహులు, అశోకు, బంధం పరమేశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పూజలు చేస్తున్న సర్పంచు శ్రీనివాసులు

**ఉప్పునుంతల, జనవరి 1 ప్రభాతవార్త :** నూతన సంవత్సరం 2026 వేడుకలు మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గురువారం మండలంలో వేకువజామున స్నానాలు ఆచరించి ఇండ్ల ముందు రంగేళి కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర ఆలయంలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వెల్టూర్, పెనిమిళ్ళ, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఉప్పునుంతలలో సర్పంచ్ తో పాటు ఆలయ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### సౌరభ దాస సాహిత్య
## పరీక్షలకు సర్వం సిద్ధం

**మహబూబ్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త :** విశ్వ మధ్వ మహా పరిషత్ రంగ సంస్థ అయిన సౌరభ దాస సాహిత్య విద్యాలయ పరీక్షలు ఈనెల 3, 4 శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు సౌరభ సంస్థ నిర్వాహకులు పండిత ప్రమోద్ ఆచార్యులు, పాలమూరు ఉత్తరాది మఠం అధికారి ఆనందాచార్యులు జోషి, పాలమూరు సౌరభ సంచాలకులు సంధ్య నరసింహాచార్యులు, సౌరభ విశ్రాంత సంచాలకులు శశిరేఖలు తెలిపారు. ఈ పరీక్షలు దేశ వ్యాప్తంగా, ఇతర దేశాల్లో దాదాపుగా 15వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వారు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని, కావున విద్యార్థులు సమయానికి హాజరై పరీక్షలు రాయాలని అదేవిధంగా పరీక్షకు వచ్చే విద్యార్థులు డ్రెస్ కోడ్ సమవస్త్రాలు ధరించి, తమ ఐడెంటి కార్డు తప్పక తెచ్చుకోవాలని లేనిపక్షంలో ఫైన్ విధించబడుతుందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

### భక్తులతో కిటకిటలాడిన
## రంగనాయక స్వామి దేవాలయం



రంగనాయకస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు

**శ్రీరంగాపూర్,జనవరి 1 ప్రభాతవార్త :**ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా శ్రీ రంగాపూర్ మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి దేవాలయం భక్తులతో సందడిగా నెలకొంది. గురువారం కొత్త సంవత్సరం సందర్భంగా భక్తులు తమ మొక్కలను చెల్లించుకుని గడిచిన సంవత్సరం తీపిగుర్తులతో ఈసంవత్సరమంతా మంచి జరగాలని, కుటుంబసభ్యులతో సంతోషంగా ఉండాలని,అన్నిరకాల విజయాలు చేకూరాలని రంగనాయకస్వామిని కోరుకొని, భక్తులు,స్నేహితులు రంగనాయకస్వామి ఆలయం దగ్గర తమ సెల్ ఫోన్లలో సెల్ఫీలను తీసుకుంటూ సందడి చేయడం జరిగింది.

### అయ్యప్ప నామస్మరణతో
## మారుమోగిన అయ్యప్పకొండ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

**నవాబుపేట, జనవరి 1 ప్రభాతవార్త :** అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. గురువారం అయ్యప్ప నామస్మరణతో నవాబుపేట ఎన్మన్‌గండ్ల అయ్యప్పకొండ మారుమోగింది. కార్యక్రమంలో భాగంగా గణపతి,కుమారస్వామి, జగన్మాత, అయ్యప్ప స్వాములకు గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పలకు,భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈపూజలో జిల్లా అయ్యప్పస్వాములు తదితరులు పాల్గొన్నారు.వెంకటేష్ గురుస్వామి, జంగయ్య గురుస్వామి, ఎన్మన్‌గండ్ల సర్పంచ్ రంజిత్‌గౌడ్,నవాబ్‌పేట సర్పంచ్‌గీతారాణి, మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయానికి
## నిర్మాణ సామగ్రి వితరణ

**నవాబుపేట జనవరి 1 ప్రభాతవార్త :**యన్మన్‌గడ్ల,తూక్య తండాలో అంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి యన్మన్‌గడ్ల గ్రామానికి చెందిన 4వ వార్డ్ మెంబర్ కోస్గి సరోజ ,వెంకటయ్య అడిగిన వెంటనే ఆలయ నిర్మాణానికి గాను అవసరమైన రూ.60,000 మెటిరల్ ఇప్పించడం జరిగింది. తనవంతుగా చందా రూపంలో ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో తనదైన శైలితో ప్రతిదాంట్లో పాలుపంచుకుంటూ తనకు ఉన్నదాంట్లో ఊరి కోసం ఊరి ప్రజల కోసం తన సహాయ సహకారాలు అందిస్తున్నారని ఈ సందర్భంగా పత్రికా విలేఖరి వెంకటయ్య కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి.రామ్ చందర్, ఆలయ చైర్మన్,తూక్య తండా ఆలయ సభ్యులు గ్రామస్థులు ఉన్నారు.

## నేడు ఉప్పునుంతలలో గ్రామసభ

**ఉప్పునుంతల,జనవరి1 ప్రభాతవార్త:** నేడు శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత మొట్టమొదటిసారిగా గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న గ్రామసభకు గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, అధికారులు, మహిళా సంఘాలు, యువకులు, గ్రామంలోని అన్ని సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు.

## అయ్యప్ప పూజ స్టోర్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,జనవరి 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప పూజ స్టోర్స్ ప్రారంభోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా పూజ స్టోర్స్ నిర్వాహకులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శ్రీశ్రీశ్రీ అయ్యప్ప పూజ స్టోర్స్ ను ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొని, తీర్థప్రసాదాలు అందుకున్నారు. తదనంతరం దేవరకద్ర మండల నాయకులకు, పూజా స్టోర్స్ నిర్వాహకులకు, దేవరకద్ర నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూజా స్టోర్స్ నిర్వాహకులు అనిల్, జీనుగురాల సర్పంచ్, ఉపసర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**దేవరకద్ర,జనవరి 1 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి దేవరకద్ర ఎంపీడీవో శ్రీనివాసరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని ఎంపీడీవో శ్రీనివాసరావుశాలువాతో ఘనంగా సన్మానించి, పూల బొకేతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్తఏడాది సందర్భంగా అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నాం. అభివృద్ధిలో రాష్ట్రం అగ్రభాగాన ఉండాలి అన్నది మన ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి పౌరుడి ఆకాంక్షలు నెరవేరాలని, ప్రతి ఇంట వెలుగులు నిండాలని, ప్రతిఒక్కరి జీవితంలోశుభ,సుఖ సంతోషాలు నింపాలనిఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆకాంక్షించారు.

## అవోపా నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



అవోపా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జనవరి1 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అవోపా 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని యూనిట్ అధ్యక్షులు కలిమిచెర్ల రాఘవేందర్ అధ్యక్షతన స్థానిక వాసవి ఆలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ట్రస్ట్ ఫౌండర్, వాసవి క్లబ్ సర్వీస్ కార్యదర్శి జూలూరి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై 2026 నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాద శోభన్ బాబు, ఆర్థిక కార్యదర్శి కల్వ ఆంజనేయులు, అవోపా సీనియర్ సభ్యులు గోవిందు సూధకర్, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు యూనిట్ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఓటర్ జాబితా పెట్టాలి

**నారాయణపేట, జనవరి1 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని మొత్తం 24 వార్డులకు సంబంధించిన ఓటరు జాబితాపై అభ్యంతరాల అంశంపై బీజేపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుత్తరి సత్య రఘుపాల్ రెడ్డి స్పందించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ 10 .01.2026గా నిర్ణయించబడిన నేపథ్యంలో ప్రజలు తమ అభ్యంతరాలు సులభంగా నమోదు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఓటరు జాబితాను వార్డు వారీగా సంబంధిత బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉంచితే ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండే చోట్ల ఓటరు జాబితాను ప్రదర్శించాలని కోరారు. దీని ద్వారా ఓటర్లు తమ పేర్లను సులభంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అధికారులు ఈ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్‌లోకి మాజీ కౌన్సిలర్ కిషోర్

### కండువా కప్పి ఆహ్వానించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ జనవరి 1 ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ప్రేమ్‌నగర్ కు చెందిన మాజీ కౌన్సిలర్ కిషోర్ కుమార్ తీళిళీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీజేపీ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈయనతో పాటు వివిధ పార్టీల నుండి కిరణ్, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, సుమన్, నర్సింహ,గఫర్, సమీర్,విష్ణు, వినయ్,హైదర్,రాజు,అనిల్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పురపాలిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు సమిష్టిగా అందరు కలిసి పనిచేయాలని కేటీఆర్ సూచించారు మహబూబ్‌నగర్ పురపాలికలో మరోమారు గులాబీజెండా ఎగురవేయాలని చెప్పారు. కార్యక్రమంలో మూడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసి నర్సింహులు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజు, మాజీ వైస్ చైర్మన్ తాటి గణేష్, మాజీ కౌన్సిలర్లు మూసనరేందర్, రామ్‌లక్ష్మణ్, ప్రభాకర్,ఆంజనేయులు,అల్తాఫ్‌హుస్సేన్, పూర్ణచందర్ ఉన్నారు.

## టీజీఆర్ఎస్ఏ, టీజీటీఏ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను

**నారాయణపేట, జనవరి 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా లోతెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ టీజీఆర్ఎస్ఏ తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ టీజీటీఏ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీఆర్ఎస్ఏ, టీజీటీఏ యూనియన్ నాయకులు అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రామచందర్, టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు చింతరవి, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, తహసీల్దార్ బక్క శ్రీను, ఉపాధ్యక్షులు రామకృష్ణ, హజారే, బి.రాణీదేవి, బాలరాజు, తహసీల్దార్లు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన డీఎస్పీ, సిఐలు



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, సిఐలతో పాటు ఇతర పోలీస్ అధికారులు

**మహబూబ్‌నగర్ క్రైమ్, జనవరి1 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి, కేక్‌కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోలీసుశాఖ అధికారులకు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల రక్షణలో పోలీసు శాఖ కీలక పాత్రను పోషిస్తోందని ప్రశంసించారు. శాంతిభద్రతల పరిరక్షణే నగర అభివృద్ధికి మౌలిక పునాదని పేర్కొంటూ, పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు నిర్భయంగా సంచరించే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు నగరంలో శాంతి భద్రతలను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామని, నిరంతర గస్తీ, నిఘా వ్యవస్థల ద్వారా ప్రజలకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు గాంధీ నాయక్, అప్పయ్య, ఎజాజుద్దీన్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## టిటియు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



టిటియు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త :** తెలంగాణ టీచర్ యూనియన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో 100% ఫలితాలు సాధించాలని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీర్ఘకాలంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించిందని విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జుర్రు నారాయణ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నిరంజన్,చంద్రకాంత్, జిల్లాకార్యదర్శులు హనుమంతు,ఆంజనేయులు,మహిళా కార్యదర్శిలు విజయలక్ష్మి, మహిళా ఉపాధ్యాయులు ప్రమీల, శోభ, వరలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

## ఆనందగిరిపై అయ్యప్ప శరణు ఘోష



ఘనంగా నిర్వహిస్తున్న పదునెట్టాంబడి మహా పడిపూజ

**బిజినేపల్లి, జనవరి1 ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్ష దైవం, హరిహరుల ముద్దుల తనయుడు, అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహా పడిపూజ మండల కేంద్రంలోని ఆనందగిరి పై అయ్యప్ప శరణు ఘోష మధ్య వైభవంగా నిర్వహించారు. 18వ సారి మాల ధరించిన ఇండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహాపడిపూజ జరిగింది. ఈ పడిపూజలో మొదటగా గణపతి పూజ, సుబ్రహ్మణ్య స్వామి పూజ ఆ తదుపరి అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం, పసుపు, కుంకుమ, చందన భస్మాభిషేకం, వివిధ పళ్ళ రసాల అభిషేకం, ఆ తదుపరి పడిపాటతో పడిపూజ చేపట్టారు. ఈ పదునెట్టాంబడి మహా పడిపూజ పాలమూరు రఘుపతి శర్మ , గురుస్వాముల ఆధ్వర్యంలో అద్భుతంగా జరిగింది. అనంతరం మంగళహారతి మంత్రపుష్పాలు పాటించారు. ఈ పూజాది కార్యక్రమంలో అయ్యప్ప భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ, శరణు ఘోషలతో ఆనందగిరి కొండ మార్మోగిపోయింది. 18వ సారి మాల ధరించిన ఇండ్ల శ్రీనివాస్‌ను గురుస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. రఘుపతి శర్మ గురు స్వామి మాట్లాడుతూ 41 రోజుల పాటుఅయ్యప్ప దీక్ష కఠోర నియమాలతో కూడుకున్నప్పటికీ,దాని వల్ల మానసిక ఆనందం, ఆత్మ పరిశీలన శక్తి, అపూర్వమైన ఆధ్యాత్మిక ఆనందం లభిస్తుందని చెప్పారు. అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయని, ఇవి కామం, క్రోధం, లోభ, మోహ, మద, మత్సర్యాలైయిన అరిషడ్వర్గాలకు ప్రతీతిగా వర్ణించారు. మనిషిలోని 18రకాల చెడు గుణాలు తొలగిపోవడానికి దీక్షలో పడిపూజ (మెట్టు పూజ) నిర్వహిస్తారని, అయ్యప్ప మాలధరించిన ప్రతిసారి చెడులక్షణాలను విడిచిపెట్టి మంచి వారిగామారాలని కోరుకుంటూ ఈ పూజను నిర్వహిస్తారని వివరించారు. కోర్కెలు తీర్చే స్వామి మణికంఠుడు అని అయ్యప్ప ను భక్తితో తలిస్తే సమస్యల గండాలను దాటిస్తాడని భక్తుల నమ్మకం అన్నారు. ఆతర్వాత పూజలకు హాజరైనఅయ్యప్పస్వామి భక్తులకు, మాలాధారణ స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పులేందర్ రెడ్డి, నందకిషోర్, మాజీ జడ్పిటిసి సుధా బాలరాజుగౌడ్, మాజీసర్పంచ్ గంగన మోడీ తిరుపతయ్య, వట్టెంసర్పంచ్ పిట్టల జ్యోతి శంకర్, మాజీ ఎంపీటీసీ బాలస్వామి ,అయ్యప్ప సేవా సమితి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

## నూతన సంవత్సరంలో నూతన ఆలోచనలకు విద్యార్థులు నాంది పలకాలి

### - డీఈఓ ఏ. రమేష్ కుమార్



నూతన సంవత్సర వేడుకల్లో డీఈఓ

**కల్వకుర్తి, జనవరి1 ప్రభాతవార్త:** నూతన సంవత్సరంలో విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకొని,కొత్త విషయాలు నేర్చుకోవాలని తెలిపారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ ఉంటేనే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సర్వతో ముఖాభివృద్ధి సాధించాలని కేజీబీవీ విద్యార్థినిలకు డిఇఒ పిలుపునిచ్చారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈఓ రమేష్ కుమార్ సందర్శించారు. నూతన సంవత్సరం సందర్భంగా కేజీబీవీ విద్యార్థినిలతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ బాలికలు కష్టపడే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా రానున్న ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. నూతన సంవత్సరం తొలి రోజు నుంచే కొత్త ఆలోచనలకు నాంది పలకాలని విద్యార్థినిలను ప్రోత్సహించారు. అంతకుముందు పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. అలాగే నాగర్‌కర్నూల్ పట్టణంలో కొనసాగుతున్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఇక్కడికి తరలించేందుకు అవసరమైన గదులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వెంట మండల విద్యాధికారి శంకర్‌నాయక్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించాలి



విద్యార్థినిలకు ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను

**నారాయణ పేట, జనవరి1 ప్రభాతవార్త :** నారాయణపేట ఉత్తమ ర్యాంకులు సాధించాలి జిల్లాకు పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను విద్యార్థులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినుల విద్యా ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు,సిబ్బంది అదనపు కలెక్టరకు ఘనంగా స్వాగతం పలికి పాఠశాల వివరాలు తెలియజేశారు. పాఠశాలలో పదవ తరగతిలో 75 మంది విద్యార్థులు చదువుతున్నట్లు ప్రిన్సిపల్ యాదమ్మ తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ కేజీబీవీ పాఠశాలను కూడా సందర్శించి విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. అక్కడ పదవ తరగతిలో 43 మంది విద్యార్థులు చదువుతున్నట్లు స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించేలా ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు 250 శానిటరీ ప్యాడ్స్, 250 నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవోశ్రీధర్, తహసీల్దారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ పోటీలకు పియు జట్టు పయనం

### క్రీడాకారులను అభినందించిన వీసీ శ్రీనివాస్



క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ జనవరి 1 ప్రభాతవార్త:** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించేటటువంటి సౌత్‌జోన్, ఆల్ ఇండియా టోర్నమెంట్లో భాగంగాపాలమూరుయూనివర్సిటీ షటిల్ బ్యాట్మెంటన్ పురుషుల టీం కెఎల్ఇఎఫ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ జనవరి 3 నుండి 6, 2026 వరకు నిర్వహిస్తున్న సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ కు బయలుదేరారు. ఈసందర్భంగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ క్రీడాకారులకు, కోచ్‌లకు క్రీడాదుస్తులు అందించి పాలమూరుయూనివర్సిటీ తరపున ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తూ పాలమూరు యూనివర్సిటీలో ఉన్నటువంటి క్రీడా సదుపాయలను సద్వినియోగం చేసుకొని యూనివర్సిటీకి ఒక గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై శ్రీనివాసులు, కోచ్ డా. అరుణ్, ప్రొ॥ సత్య భాస్కర్ రెడ్డి, డా. రజిని యుగంధర్ ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## నేటి నుంచి పాఠశాలల తనిఖీలు

**ఉప్పునుంతల, జనవరి 1 ప్రభాతవార్త:** జిల్లాలో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేటి నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలపై విస్తృత స్థాయి తనిఖీలు ప్రారంభం కానున్నాయి. విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు పాఠశాలల నిర్వహణ స్థితిగతులను పరిశీలించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం 130 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేయడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందానికి ఒక జిహెచ్ఎం నోడల్ అధికారిని నియమించి, తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీ కోసం ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలను పరిశీలించేందుకు ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధనా విధానం, మధ్యాహ్న భోజన పథకం అమలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను బృందాలు క్షుణ్ణంగా పరిశీలించనున్నాయి. లోపాలు గుర్తించిన పాఠశాలలపై తగిన చర్యలు తీసుకునేలా నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను మరింత పెంపొందించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

## ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పొడగింపు

**గద్వాల జనవరి1, ప్రభాతవార్త:** 2025-26 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతన దరఖాస్తుల గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి నుషిత గురువారం ఒకప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం,షెడ్యూల్డ్ కులముల అభివృద్ధిశాఖ, హైదరాబాద్‌వారి ఆదేశానుసారంజోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునే గడువును 31.03.2026 వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఎస్సీ/ఎస్టీ/బీసీ/ మైనారిటీ వర్గాలకు చెందిన పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థినీ విద్యార్థులు,తమఅర్హతను బట్టివెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, తమ కళాశాలలలో చదువుతున్న విద్యార్థుల వివరాలను డిజిటల్ కీ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసి, సంబంధిత జిల్లా షెడ్యూల్డ్ కులములఅభివృద్ధి కార్యాలయానికి పంపవలసిందిగా సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



అచ్చంపేట పట్టణంలో ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ఉప్పునుంతల, జనవరి 1 ప్రభాతవార్త :** వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మండల ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆకుతోట లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ అధ్యక్షులు కొరివి చంద్రశేఖర్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు, మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బంధం పరమేశ్వర ప్రసాద్, కోశాధికారి వీరబ్రహ్మం, చంద్రశేఖర్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఖాన్‌దొడ్డి సర్పంచ్‌ను సన్మానించిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు



**కృష్ణ, జనవరి 1 ప్రభాతవార్త :** ఖాన్‌దొడ్డి గ్రామంలో నూతనంగా గెలిచిన సర్పంచ్ సంగోళ్ళ వెకటేష్, ఉపసర్పంచ్ దుకాణం శ్రీనివాస్ లను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుంజనూర్ ఆంజనేయులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి దిశగా ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పని చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సగరం రమేష్, గొల్ల నరేష్, బాల్దాస్ శ్రీనివాస్, తంగిడి అనిల్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించండి



రోడ్డుపై గుంపులుగా వీధి కుక్కలు

**రాజాపూర్, జనవరి1 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్నారులను, ప్రజలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, వీధి కుక్కల భారీ నుంచి విముక్తి కల్పించాలని రాజాపూర్ మండల ప్రజలు వేడుకుంటున్నారు. అనునిత్యం వీధి కుక్కలు రోడ్లపై సంచరిస్తుండడంతో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని, గ్రామపంచాయతీ పాలక వర్గం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రాజాపూర్ మండల కేంద్రం వాసులు కోరుతున్నారు.

## నేటి నుండి పర్వతాపూర్ మైసమ్మ జాతర

**నవాబుపేట, జనవరి 1 ప్రభాతవార్త :** మహిమాన్విత పర్వతాపూర్ మైసమ్మ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాచుర్యం పొందిన మైసమ్మ దేవాలయ జాతర నేటినుండి ఈ నెల 6వ తేదీ వరకు అట్టహాసంగా జరగనుంది. నవాబ్ పేట మండల పరిధిలోని కాకర్లపాడు మైసమ్మ జాతర వచ్చే నెల 2026 జనవరి 2 నుంచి 6వరకు నిర్వహించనున్న పర్వతాపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారని ఆలయ ఈవో నరసింహులు, ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డిఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు మైనుద్దీన్, నారాయణరెడ్డి, వీరాంజనేయులు. రికార్డ్ అసిస్టెంట్ గోపాల్, మల్లేష్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.

## అనాథ చిన్నారులకు ఆపన్న హస్తం



అనాథ చిన్నారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, జనవరి 1 ప్రభాతవార్త:** దినపత్రికల్లో ప్రచురితమైన ఈ చిన్నారులకు దిక్కెవరు" అనే వార్తకు స్పందించి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ చొరవతో రిటైర్డ్ ఉద్యోగులు,ప్రభుత్వ ఉద్యోగులు స్పందించి గురువారం అనాథ చిన్నారులకు ఆర్థిక సహాయం చేసి ఆపన్నహస్తం అందించారు. రిటైర్డ్ తహసీల్దార్ సుంకసారి చంద్రశేఖర్, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల నుంచి సేకరించిన రూ.50,000 విరాళాల్లో నుంచి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ద్వారా రూ.25,000ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సిఎస్) ఆధ్వర్యంలో ఉన్న ఇద్దరు మగ పిల్లలకు, మరో రూ.25,000ను ఐసిడిఎస్ బాల సదనం లో ఉన్న ఇద్దరు ఆడ పిల్లలకు అందజేయడం జరిగింది.6 వేల రూ.ల బట్టలను పిల్లలకు అందజేశారు. చిన్నారుల సంక్షేమం పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఏ. నటరాజ్, కార్యదర్శి జగపతి రావు, డా. శామ్యూల్, డా. విష్ణు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## మోగనున్న మున్సి'పోల్స్' నగారా

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీల వారీగా క్రమబద్ధీకరించడం, 31న వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల డేటా విభజన,మున్సిపల్ వార్డు వారీగా ఓటర్ల జాబితా రూపకల్పన, జనవరి ఒక టవ తేదీన ఓటర్ల జాబితా ప్రచురణకు అభ్యంతరాల స్వీకరణ, జనవరి 5,6వ తేదీలలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో (యుఎల్‌బి/జిల్లాస్థాయి) ప్రత్యేక సమావేశాలు,జనవరి 10న ఓటర్ల తుది జాబితా(ఫైనల్ రోల్)ను విడుదల చేసేందుకు ఎస్ఈసీ కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం జనవరి ఒకటిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు/సవరణలు ఏవైనా ఉంటే నోటీసు బోర్డుల ద్వారా తెలుపవచ్చని ఎస్ఈసీ పేర్కొన్నట్లు తెలుస్తోంది.అన్ని సవరణల తర్వాత జనవరి10,2026న తుది జాబితాను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు కూడా తెలిసింది.ఈ జాబితా ఆధారంగానే మున్సిపల్ ఎన్నికలు జరుపుతారని విశ్వసనీయ సమాచారం.ఈనెల రెండో వారంలో నోటిఫికేషన్ వెలువరించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

భారీ బైక్ ర్యాలీ నిర్వహించి లఘు నాటికలు ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. జనవరి 9వ తేదీన జిల్లాలోని అందరు లారీడ్రైవర్లకు,13న ఆటో డ్రైవర్లకు, జనవరి 19న తుఫాన్, ఇతర లైట్ గూడ్స్ వెహికిల్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు,చికిత్స క్యాంప్‌లునిర్వహించేందుకు షెడ్యూల్ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రణాళిక ప్రకారం నిర్వహించి అవగాహన సదస్సులు విజయవంతం చేయాలని కలెక్టర్ రోడ్డు రవాణా అధికారిని ఆదేశించారు. జిల్లా రోడ్డు రవాణా అధికారి మానస, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సీతారాం, వెహికిల్ ఇన్స్పెక్టర్, సిబ్బంది తదితరులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## రూ.15 కోట్ల నిధులతో పనులు వేగవంతం చేయండి



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. డ్రైనేజ్ నీటి సమస్య కరెంటు రోడ్లు మున్సిపాలిటీలోని అన్ని సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ కమిషనర్ నరేష్ బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు,తహసిల్దార్ దీపికా రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ ,ఏడి సంతోష్, మిషన్ భగీరథ ఏఈ కీర్తి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, కౌకుంట్లమండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, ఆది హనుమంత్ రెడ్డి, ఉమ్మి గారి వెంకటేష్, బల్సుపల్లి శంకర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)

సాగనంపుతారు, సాయంత్రం మనం తిరిగి వెళ్ళేటప్పుడు వారిలో అదే చిరునవ్వు ఉండేటట్లు భద్రంగా ఇంటికి చేరాలని ఆయన అన్నారు. అందువల్ల ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి, హెల్మెట్ ధరించి, సురక్షితంగా ప్రయాణించాలని పిలుపునిచ్చారు.ఈ రోడ్డు భద్రత కార్యక్రమంలో తను కూడా తన వంతు బాధ్యతగా తన సొంత డబ్బులతో జిల్లా కలెక్టరేట్ సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. కొన్ని అదనపు హెల్మెట్లు ఎ.ఓ కార్యాలయంలో ఉంచుతున్నట్టు ఆయన తెలిపారు. ఒకవేళ ఎవరైనా సిబ్బంది హెల్మెట్ వేసుకోకుండా మర్చిపోయి వస్తే, సాయంత్రం వారు ఎఓ కార్యాలయం నుండి హెల్మెట్ తీసుకొని భద్రంగా ఇంటికి వెళ్లాలని, మరుసటి రోజు వారు తీసుకెళ్లిన హెల్మెట్ ను తిరిగి ఎఓ కార్యాలయంలో అందించాలని ఆయన కోరారుకలెక్టరేట్ సిబ్బంది ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, హెల్మెట్ వినియోగంపై అవగాహన కలిగించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రతపై అవగాహనను ఇతరులకు కూడా వ్యాప్తి చేయాలని, ప్రతి ఒక్కరిని ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ప్రేరేపించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ ఈ. నవీన్ తో పాటు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**అయిజ జనవరి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు 50 గుండె పోటుకు గురై మృతి చెందాడు. గురువారం ఉదయం గ్రామం నుంచి స్వంత పని మీద అయిజ కు వచ్చాడు. ఈ క్రమంలో మేడికొండ చౌరస్తా సమీపంలోని పెట్రోల్ బంక్ వెనక ఉన్న ముళ్లపొదల్లోకి బహిర్భూమికి వెళ్ళాడు. అక్కడ గుండెపోటు రాగా అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం అటుగా వెళ్లిన వారు గుర్తించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్నవారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే ఏడాది క్రితం అతడికి గుండెపోటు రాగా స్టంట్ వేసినట్లు కుటుంబ సభ్యులు చెప్పారని ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపారు. మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అయితే మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారందరూ కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్యా పిల్లలు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

# జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించాలి

**-జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**
**-జిల్లాలో జనవరి 1 నుంచి రహదారి భద్రతా మాసోత్సవాలు**
**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 1 ప్రభాతవార్త:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, ఫ్లెక్సీలను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్‌సంతోష్ ఆవిష్కరించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని తనచాంబర్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రహదారి భద్రతా కరపత్రాలను జిల్లా కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, జనవరి 1 నుంచి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో రోడ్డు





జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. రవాణా శాఖ సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదు, రాంగ్ రూట్‌లో ప్రయాణించరాదు, అతివేగం నివారించాలన్నారు. జిల్లాలో ఫిట్నెస్ లేని వాహనాలపై, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే చోదకులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్టీవోను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించే విధంగా అధికారులు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సహాప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి చిన్నబాలు, రవాణా అధికారి కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిష్పక్షపాతంగా సేవలందించాలి

**నిబద్ధత పారదర్శకతతో పనిచేయాలి**
**మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరవత్ సూచన**
**ప్రమోషన్ పొందిన ఎస్పీ డి.జానకికి అధికారుల శుభాకాంక్షలు**

**మహబూబ్‌నగర్ క్రైమ్, జనవరి 1 ప్రభాతవార్త:** ప్రజలకు నిష్పక్షపాతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ధరావత్ సూచించారు. జిల్లా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీస్ కవాతు మైదానం నందు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ గత సంవత్సరంలో జిల్లా పోలీస్ శాఖ ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను స్మరించుకుంటూ, నూతన సంవత్సరంలో కూడా పోలీసు అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బందిని ఉద్దేశించి తెలిపారు. అలాగే ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలపై సానుకూల దృక్పథంతో స్పందించాలని కోరారు. నూతన సంవత్సరంతో పాటు జిల్లా ఎస్పీ జానకి సీనియర్ ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా, జిల్లా పోలీస్ శాఖకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ జిల్లా ఎస్పీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో జిల్లా పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో జిల్లా పోలీస్ శాఖ మరింత ప్రజాపక్షంగా, బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లా అభివృద్ధి భద్రతలో కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా 2013 వ బ్యాచ్ ఐపీఎస్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో 12 మందికి ప్రమోషన్ రాగా అందులో మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి కూడా ఉన్నారు. ఈ మేరకు గత నెల 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, గిరిబాబు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, జిల్లా పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు ఎస్పీ, డిఎస్పీ లు, సిఐలు, ఎస్ఐలు





కేక్ కట్ చేస్తున్న ఎస్పీ జానకి ధరావత్

# అయ్యప్ప నినాదాలతో మార్మోగిన అయిజ పట్టణం

## ఆధ్యాత్మిక వైభవంతో భారీ ర్యాలీ

**అయిజ జనవరి 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో అయ్యప్ప స్వాముల వారి ఆధ్వర్యంలో గురువారంనిర్వహించిన అయ్యప్ప స్వాముల మహా పడిపూజాకార్యక్రమం ఆధ్యాత్మిక శోభతో ఘనంగా మారుమోగింది. ఇందులో భాగంగా పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించగా, భక్తుల నినాదాలతో పట్టణమంతా భక్తి మయ వాతావరణంతో నిండిపోయింది. అయ్యప్ప స్వాముల మాల ధారులు నిష్ఠ, నియమాలు, శుద్ధితో అడుగులు వేస్తూ,మాస్టర్ శివ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులతో కోలంటాల మధ్య స్వామియే శరణం అయ్యప్ప అనే నినాదాలతో ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపారు పట్టణంలోని ప్రధాన వీధులు భక్తి శోభతో దర్శనమిచ్చాయి పవిత్ర కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు టపాల రామాంజనేయులు, జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, అయిజ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రలో పాల్గొన్నారు మహా పడిపూజ కార్యక్రమం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యము, సద్భావనలు మరింత పెంపొందాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అయిజ అయ్యప్పస్వాముల కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్,రాజశేఖర్, ఖుషి, లక్ష్మణాచారి, మాధవాచారి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, కన్య స్వాములు, చిన్నారులు పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



అయ్యప్ప శోభయాత్రలో పాల్గొన్న బిజెపి నాయకులు



శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

# పిఆర్‌టియు 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**నారాయణపేట, జనవరి1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర గోడ, టేబుల్ క్యాలెండర్‌లను ఘనంగా ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మాధవి పిఆర్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఊట్కూర్ గ్రామ సర్పంచ్ రేణుక భరత్, ఉపసర్పంచ్ రమేష్, మాజీ జడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి చేతులమీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను పిఆర్‌టియు మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ పిఆర్‌టియు ముందుంటుం దని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు.ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏబకాయిలు, పీఆర్‌సీ సాధన కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుం దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోరం గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఫజల్ అహ్మద్, నారాయణపేట మండల అధ్యక్షుడు రఘువీర్,దామరగిద్ద మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డిపాల్గొన్నారు.మహిళా ఉపాధ్యక్షురాలు సభా సుల్తానా,జిల్లా బాధ్యులు వెంకటేష్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు శ్రీవిద్య వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరించిన నాయకులు

# బస్సు నడపాలని ఆర్టీసీ డీఎంకు నూతన సర్పంచ్ వినతి

**భూత్పూర్,జనవరి 1,ప్రభాతవార్త :** పల్లెవెలుగు బస్సులు తమ గ్రామ సర్వీస్ రోడ్‌పై కాకుండా హైవే రోడ్‌పై వెళ్తుండడంతో గ్రామ ప్రజలు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ నూతన సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి తన సహచరులైన వార్డు సభ్యులతో కలిసి గురువారం మహబూబ్‌నగర్ డిపో మేనేజర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.తమ గ్రామమైన అన్నాసాగర్ జాతీయ రహదారి-44పై ఉండగా గ్రామం మీదుగా సర్వీస్ రోడ్ ఉండగా,పల్లెవెలుగు బస్సులు మాత్రం సర్వీస్ రోడ్‌పై నుంచి కాకుండా హైవే మీదుగా వెళ్తుండడంతో గ్రామ ప్రజలతో పాటు రావులపల్లి గ్రామవాసులు ప్రయాణం చేయాలంటే హైవే రోడ్ ఎక్కాల్సిన పరిస్థితేర్పడిందని,హైవేపై వేగంగా వెళ్తే కారులు,లారీలు ఇతర వాహనాల వల్ల ప్రమాదం పొంచి ఉన్నందున పల్లెవెలుగుబస్సులు అన్నాసాగర్ గ్రామ సర్వీస్ రోడ్‌పై నుంచి వెళ్లే విధంగా ఆదేశాలు జారీ చేయాలని సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి వినతిపత్రంలోకోరారు.సర్పంచి వెంట నవీన్,బోయ చెన్నయ్య,రామకృష్ణతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి



**మహబూబ్‌నగర్, జనవరి1 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డుల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రైతులకు మెరుగైన వసతులు, పారదర్శక లావాదేవీలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన డిపిఆర్‌ఓ

**గద్వాల జనవరి 1, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ గారిని గురువారం డి పి ఆర్ ఓ అరేఫుద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి పూల బొకే అందజేసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న సమాచార శాఖ మరింత బలవపేతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ సిబ్బంది నాగేశ్వరి రోహిత్ జావేద్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, జనవరి 1 ప్రభాతవార్త:** జర్నలిస్ట్ సంక్షేమానికి తాము, కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకద్ర మున్సిపాలిటీ ఎమ్మెల్యే కార్యాలయంలోజర్నలిస్టు మిత్రులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంజర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డులు, ఇంటి స్థలాలు,వంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.కొత్తగా వచ్చిన జర్నలిస్టులకు కూడా త్వరలో ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి విలేకరి రాజశేఖర్, వార్త విలేఖరి ఎండి. యాకూబ్, మనతెలంగాణ విలేఖరి రాజేందర్‌గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో మీడియా మిత్రులు

## ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రేరణాత్మక సినిమాలువిద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటాయని పేర్కొంటూ,ప్రతి ఆదివారం వసతి గృహాల్లో ఇలాంటి మోటివేషనల్ సినిమాలు ప్రదర్శిస్తామని తెలిపారు.తల్లిదండ్రుల కృషిని వృథా చేయకుండా చదువుపై పూర్తిగా దృష్టి పెట్టాలని,ప్రతి విద్యార్థి రోల్ మోడల్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కటింగ్ చేశారు.ఈ కార్యక్రమలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సుశిత,బిసి సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా,వార్డెన్లు శ్రీను,మధు, రామకృష్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్,ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ట్యాక్స్ రసీదు, బీమా వంటి అవసరమైన పత్రాలు వెంటఉంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు నడపనివ్వకూడదని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఓ రఘుకుమార్, ఎంవిఐ వాసుదేవ రావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రుబీనా పర్వీన్, రఘు బాబు, ప్రవీణ్ కుమార్,రవాణా శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది, వాహనదారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

2026లో ఇదే వరవడిని సైతం కొనసాగించి నాగర్‌కర్నూల్ జిల్లా చరిత్రలో మిగిలిపోయే విధంగా పనులు చేయాలని అన్నారు. జిల్లాలో అన్ని వనరులు ఉన్నాయని ,నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి, సిబ్బంది వారి వారి పనులలో ప్రతిరోజు పురోగతి ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని,అదే సమయంలో వ్యక్తిగత ఆరోగ్యం,కుటుంబ సంక్షేమంఅన్ని అంశాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు జిల్లా యంత్రాంగం తరపున ఉద్యోగులకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు,సలహాలతో పాటు,జిల్లా యంత్రాంగం అండజేస్తామని తెలిపారు. అనంతరం టీజీవో, తహసిల్దార్లు, సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆర్డీవోలు, పాత్రికేయులు, తదితరులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే జిఎంఆర్‌తో జిల్లా పోలీస్ అధికారులు

**దేవరకద్ర,జనవరి 1 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని జిల్లా పోలీస్ అధికారులు కలిసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మహబూబ్‌నగర్ డిఎస్పి వెంకటేశ్వర్లు, భూత్పూర్ సిఐ రామకృష్ణ, కొత్తకోట సిఐ రాంబాబు,దేవరకద్ర, భూత్పూర్,మూసాపేట్, కొత్తకోట ,చిన్నచింతకుంట, సిసి కుంట, మండలాల ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీకి సీనియర్ ఐపీఎస్ హోదా

**గద్వాల జనవరి 1, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న టి. శ్రీనివాసరావు కు సీనియర్ ఐపీఎస్ అధికారిగా పదోన్నతి లభించడం జిల్లా పోలీస్ విభాగానికి గర్వకారణంగా నిలిచింది. విధి నిబద్ధత, పరిపాలనా దక్షత, ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో చూపిన అంకితభావానికి గుర్తింపుగా ఈ పదోన్నతి లభించిందని పోలీస్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల్ డిఎస్పీ వై. మొగులయ్య, ఏఆర్ డిఎస్పీ నరేందర్ రావు, ఏవో సతీష్ కుమార్, ఆర్ఐలు వెంకట్, హరీష్, గద్వాల్ - అల్లంపూర్ - శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టంగుటూరి శ్రీను, రవిబాబు, టాటా బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రవి, భరోసా ఎస్సై తారక, ఐటీసెల్, సైబర్, డిసిఆర్బి, స్పెషల్ బ్రాంచ్, క్లూస్ టీం తదితర విభాగాల అధికారులు, సిబ్బంది, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.